నమస్తే తెలంగాణ
రాజన్న సిరిసిల్ల
3 కరీంనగర్, శనివారం 13 జనవరి 2024 RAJANNA SIRCILLA

# సర్దుబాటుకు ససేమిరా..?

పది మందికి షోకాజ్ నోటీసులు

కరీంనగర్ కమాన్ చౌరస్తా, జనవరి 12 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన సవ్యంగా సాగేందుకు కరీంనగర్ జిల్లా విద్యాశాఖ ఇటీవల ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను చేపట్టింది. అందులో భాగంగా దాదాపు 82 మంది టీచర్లను సర్దుబాటు చేయాలని నిర్ణయించి, గత నెల చివరి వారంలో ఉత్తర్వులు అందించింది. అందులో దాదాపు 70 మంది వరకు ఉపాధ్యాయులు తమకు కేటాయించిన పాఠశాలల్లో రిపోర్ట్ చేశారు. కానీ, మిగతా ఉపాధ్యాయులు విధుల్లో చేరకుండా ఉన్న స్థానాల్లోనే కొనసాగుతున్నారు. దీంతో నాలుగు రోజుల క్రితమే డీఈవో జనార్దన్ రావు ఆ పది మందికి షోకాజ్ నోటీసులు అందజేశారు. అయినా కొందరు తమకున్న పలుకుబడితో ఆ ఉత్తర్వులను తుంగలో తొక్కేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తున్నది. జిల్లా కేంద్రానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు పాఠశాల మారకుండా ఉండేందుకు ఏకంగా పొరుగు రాష్ట్రానికి చెందిన ఒక ఉన్నతాధికారితో ఫోన్ చేయించినట్టు తెలిసింది. అదే బాటలో మరి కొందరు పంతుళ్లు సైతం తమకు నచ్చిన స్థానానికి వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారనే ప్రచారం సాగుతున్నది.



అలిశెట్టికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

# అలిశెట్టి రచనలు స్ఫూర్తిదాయకం

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల టౌన్, జనవరి 12: అలిశెట్టి రచనలు నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కీర్తించారు. అక్షర సూరీడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి, వర్ధంతి సందర్భంగా శుక్రవారం జగిత్యాల పట్టణంలోని అంగడిబజార్‌లోని అలిశెట్టి విగ్రహానికి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. అనంతరం మాట్లాడారు. అలిశెట్టి ప్రభాకర్ రచనలు, కవిత్వం, ఫొటోలు సమాజ నిర్మాణానికి అవసరమన్నారు. బీఆర్ఎస్ పక్షాన వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామన్నారు. గతంలోనే డబుల్ బెడ్రూం ఇల్లు కూడా మంజూరు చేశామని గుర్తు చేశారు. ఇక్కడ మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, స్థానిక కౌన్సిలర్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కమిషనర్ అనిల్‌బాబు, డీఈ రాజేశ్వర్, నాయకులు బాలె శంకర్, వల్లెపు మొగిలి, తాండ్ర సుధీర్, గౌరి శ్రీనివాస్, అబ్దుల్ అజీజ్, వేణుమాధవ్, పెండెం గంగాధర్, శేఖర్, కత్రోజ్ గిరి, శేఖర్, మహేశ్ ఉన్నారు.

# ఆగని కడుపు 'కోత'లు

- కరీంనగర్ జిల్లాలో జోరుగా సీ-సెక్షన్ ఆపరేషన్లు
- తీరుమారని పలువురు ప్రైవేట్ వైద్యులు
- ప్రైవేట్‌లో ప్రతి 100 ప్రసవాల్లో 87 సిజేరియన్లే
- ఒక్కొక్కరి నుంచి ₹50వేలకుపైగా వసూళ్లు
- డబ్ల్యూహెచ్‌వో మార్గదర్శకాలకు విరుద్ధంగా వైద్యుల తీరు
- మెడికల్ మాఫియాకు కేరాఫ్‌గా కరీంనగర్ మారిందనే విమర్శలు
- ఆపరేషన్లపై వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆగ్రహం
- రంగంలోకి జిల్లా వైద్యశాఖ



*నార్మల్ డెలివరీలను ప్రోత్సహించాల్సిన పలువురు ప్రైవేట్ వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. కాన్పు కోసం దవాఖాన మెట్లెక్కితే చాలు.. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా కడుపు కోసి బిడ్డను చేతిలో పెడుతున్నారు. ప్రసవాల్లో పది శాతం వరకే సిజేరియన్లు చేయాలని ప్రపంచ వైద్య ఆరోగ్య సంస్థ స్పష్టం చేస్తున్నా.. మరోవైపు అధికారులు హెచ్చరిస్తున్నా ఏ మాత్రం లెక్కచేయడం లేదు. ఆపరేషన్లతో మహిళల జీవితాల్లో అనేక ఆటుపోట్లు ఎదురవుతున్నా పట్టించుకోవడం లేదు. ఉమ్మడి జిల్లాలోనే అత్యధిక సిజేరియన్లు కరీంనగర్‌లోనే జరుగుతుండగా, కరీంనగర్ జిల్లా కేంద్రం మెడికల్ మాఫియాకు కేరాఫ్‌లా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ప్రైవేట్‌లో జరిగే ప్రతి 100 డెలివరీల్లో 87 శాతం ఆపరేషన్లు చేస్తుండగా, రాష్ట్ర హెల్త్ అండ్ ఫ్యామిలీ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఏకంగా ఇక్కడకు వచ్చి సమీక్షించడం, చర్యలకు ఆదేశాలు జారీ చేయడం పరిస్థితికి అద్దం పడుతున్నది.*

కరీంనగర్, జనవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిజేరియన్ ద్వారా జన్మించిన బిడ్డ కన్నా సాధారణ ప్రసవం ద్వారా పుట్టిన బిడ్డకే ఎక్కువ తెలివి తేటలుంటాయని యూనిసెఫ్ గతంలోనే తేల్చి చెప్పింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన ప్రమాణాల ప్రకారం చూసినా.. ప్రసవాల్లో కేవలం 10 శాతం వరకే సిజేరియన్లకు అనుమతి ఉన్నది. అయినా సిజేరియన్ల విషయంలో పలువురు జిల్లా వైద్యుల తీరు ఏమాత్రం మారడం లేదు. కాసుల కోసం ఎంతకైనా దిగజారుతున్నారనే విమర్శలు వస్తున్నా.. పట్టించుకోవడం లేదు. గర్భిణులు దవాఖాన మెట్లెక్కితే చాలు ఏదో ఒక కారణం చెప్పి ఆపరేషన్లు చేసేస్తున్నారు. ఒక్కో పెషెంట్ నుంచి ₹50వేల నుంచి ఆపైనే దండుకుంటున్నారు. 2017లో విడుదలైన సామాజిక ఆర్థిక సర్వే ప్రకారం.. ఆనాడు 63.4శాతం సిజేరియన్లు చేసినట్టు వెల్లడైంది. దీనిపై చర్యలు తీసుకోవాలని అప్పట్లోనే అధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు వైద్యులకు చెప్పినా తమ తీరు మార్చుకోలేదు. తిరిగి 2018 నాటికి ఆ కోతలు ఏకంగా 81.1 శాతానికి పెరగడం చూస్తే పరిస్థితి ఎంత దారుణంగా ఉన్నదో అర్థమవుతున్నది. ముఖ్యంగా ప్రైవేట్‌లో సిజేరియన్లకు అడ్డూ అదుపులేకుండా పోతుండగా, ఈ దందాకు అడ్డుకట్ట పడడం లేదు.

## 86 శాతం దాటిన ఆపరేషన్లు

నిజానికి సిజేరియన్లు ఏయేటికాయేడు తగ్గాలి. ప్రభుత్వం రంగంలో ఆ దిశగా కొంత మేరకు అడుగులు పడుతున్నా.. ప్రైవేటులో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నది. కరీంనగర్ జిల్లాలో గతేడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు చూస్తే ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో కలిపి మొత్తం 9.229 ప్రసవాలు జరిగాయి. అందులో సాధారణ ప్రసవాలు 2,678 (29.01 శాతం) కాగా, సిజేరియన్లు 6,551 (70.98శాతం) జరిగాయి. ఈ మొత్తం ఆపరేషన్లలో 5,190 ప్రభుత్వ దవాఖానల్లో జరుగగా, అందులో సిజేరియన్లు 3,044 (58.65 శాతం), సాధారణ ప్రసవాలు 2,146 (41.34 శాతం) అయ్యాయి. ఇక ప్రైవేట్‌లో 4,039 ప్రసవాలు జరిగితే, అందులో సాధారణ ప్రసవాలు కేవలం 532(13.12శాతం) మాత్రమే. సిజేరియన్లు 3,507 (86.82 శాతం) జరిగాయి. మామూలు మౌలిక సదుపాయాలున్న ప్రభుత్వ దవాఖానల్లోనే 55 శాతం సాధారణ ప్రసవాలు చేస్తుంటే.. ప్రైవేట్‌లో ప్రతి 100 మందిలో 87 మందికి సిజేరియన్లు చేస్తుండడం, తీవ్రంగా పరిగణించాల్సిన అవసరమున్నది.

## భయం.. సెంటిమెంట్లు

సిజేరియన్ ఆపరేషన్లు తగ్గించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ పదేపదే చెబుతున్నది. కేంద్రం కూడా హెచ్చరికలు జారీ చేస్తున్నది. రాష్ట్రంలో పరిస్థితి కాస్త మెరుగైనప్పటికీ కరీంనగర్ జిల్లాలో మాత్రం మార్పు రావడం లేదు. అందులోనూ కరీంనగరంలోని పలు ప్రైవేట్ దవాఖానలకు చెందిన వైద్యులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. ఎవరైనా అడిగితే వివిధ కారణాలను చూపి తప్పించుకుంటున్నారు. కొంత మంది ముహూర్తం చూసుకొని, ఆ సయమానికి బిడ్డ పుట్టేందుకు సిజేరియన్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, తాము కాదంటే ఇతర దవాఖానకు వెళ్తామంటున్నారని, అందుకే చేయాల్సి వస్తున్నదని ఓ సీనియర్ వైద్యురాలు చెబుతున్నారు. అలాగే సాధారణ కాన్పులకు నేటి మహిళలు కొంత భయ పడుతున్నారని మరో వైద్యురాలు చెప్పారు. నార్మల్ డెలివరీ సమయంలో ఉండే ఇబ్బందులను సినిమాల్లో ఎక్కువగా చూపుతున్నారని, వాటిని చూసి భయపడి సిజేరియన్లకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారని మరికొంత మంది వైద్యులు చెబుతున్నారు. వైద్యులు చెబుతున్నట్టుగా ఒత్తిడి ఉన్న మాట వాస్తమే అయినా సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాల్సిన బాధ్యతను విస్మరించడం కరెక్ట్ కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. పేషెంట్లు చెప్పిన కారణాలను సాకుగా చూపుతూ.. కాసుల కోసం కత్తెర్లకు పని చెబుతున్నారని విమర్శిస్తున్నారు. హైదరాబాద్‌లోని మహిళల కోసం ఏర్పాటు చేసిన ఒక కార్పొరేట్ దవాఖానలో వైద్యులపై ఎంత ఒత్తిడి వచ్చినా సాధారణ ప్రసవాలనే ప్రోత్సహిస్తూ కౌన్సెలింగ్ ఇస్తున్నారని, సదరు దవాఖానలో 80 శాతం సాధారణ ప్రసవాలు జరుగుతున్నట్టు ప్రభుత్వ గణాంకాలే వెల్లడిస్తున్నాయని పేర్కొంటున్నారు. అక్కడ ఎలా సాధ్యం అవుతున్నదని, ఇక్కడ మాత్రం ఎందుకు ఆపరేషన్లు పెరుగుతున్నాయని ప్రశ్నిస్తున్నారు. పేషంట్లు అయినా, వారి బంధువులు అయినా.. ఎవరు ఎంత ఒత్తిడి చేసినా తలొగ్గకుండా సాధ్యమైన మేరకు కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ ప్రసవాలవైపు ప్రోత్సహించాల్సిన అవసరం కచ్చితంగా ఉన్నదని స్పష్టం చేస్తున్నారు.

## కట్టడికి చర్యలు

ప్రైవేట్ దవాఖానల్లో విచ్చలవిడిగా జరుగుతున్న సిజేరియన్ల వ్యవహారంపై ఇటీవల వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్ ఆగ్రహించారు. గతంలో కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో ఆయన ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్నారు. సిజేరియన్ల విషయమై ఇటు వైద్యులతోనూ అటు జోతిష్య పండితులతో సమావేశాలు నిర్వహించారు. ఇటువంటి వాటికి ముహూర్తాలు పెట్టరాదని, సదరు పండితులను పిలిచి మరీ చెప్పారు. అంతేకాదు, సదరు జోతిష్య పండితులపై నిఘా పెట్టారు. దీంతో ఆపరేషన్లు అప్పట్లో కొంత తగ్గుముఖం పట్టినట్టు కనిపించినా.. మళ్లీ పెరిగాయి. ప్రస్తుతం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్‌గా ఉన్న కర్ణన్, సిజేరియన్లను సీరియస్‌గా తీసుకొని బుధవారం ప్రత్యేకంగా నగరానికి వచ్చారు. సంబంధిత అధికారులతో సమీక్షించి, ఈ తరహా కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో జిల్లా వైద్య శాఖ అధికారులు రంగంలోకి దిగారు.



### పకడ్బందీ చర్యలు తీసుకుంటాం

అనవసర సిజేరియన్ల కట్టడికి చర్యలు తీసుకుంటాం. అందుకోసం ప్రత్యేక బృందాలను సైతం రంగంలోకి దింపుతాం. నెలవారీగా జరిగిన సీ సెక్షన్ ఆపరేషన్ల తెప్పించి వాటిపై ఆడిట్ నిర్వహిస్తాం. ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉన్నదా..? లేదా..? అన్న అంశంపై నిపుణుల ద్వారా తెలుసుకొని సదరు దవాఖానలపై చర్యలు తీసుకుంటాం. నేనొక్కటే చెబుతున్నా అవసరమైతే తప్ప ఆపరేషన్లు చేయవద్దు. అనవసరంగా చేస్తే చర్యలుంటాయని వైద్యులను హెచ్చరిస్తున్నా. ముహూర్తాల పేరిట ఆపరేషన్లు చేయించుకుంటూ ప్రసవాలు చేయడం మంచిది కాదు. వైద్యులు ఇటువంటి వాటికి స్వస్తి పలకాలి.

- లలితాదేవి, జిల్లా వైద్యాధికారి (కరీంనగర్)



మాట్లాడుతున్న నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

# సంజయ్.. ఇంకెన్నాళ్లీ అసత్య ప్రచారం

- ఆర్వోబీలో కేంద్రం డబ్బులు ఏమీ లేవు
- రాష్ట్రానికి రావాల్సిన నిధులతోనే పనులు సాగుతున్నాయి
- నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 12: 'ఎంపీ బండి సంజయ్ నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలే. అభివృద్ధి విషయంలో ఇంకెన్నాళ్లీ అసత్య ప్రచారం. ఇప్పటికైనా తీరు మార్చుకోవాలి' అని కరీంనగర మేయర్ యాదగిరి సునీల్‌రావు సూచించారు. తీగలగుట్టపల్లి వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిని కేంద్ర ప్రభుత్వం నిధులు ₹154 కోట్లతో చేపడుతున్నామని చెప్పడం పూర్తిగా అబద్ధమన్నారు. ఈ పనుల్లో కేంద్రానిది నయా పైసా లేదని తేల్చి చెప్పారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరులతో ఆయన మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ అమ్మకాలపై రాష్ట్రాలకు ఇచ్చే సెస్‌ను కేంద్రం నేరుగా కాకుండా సెంట్రల్ రోడ్డు ఇన్‌ఫ్రాస్టక్చర్ కింద ఇస్తున్నదని, ఆ నిధులు రైల్వే ఓవర్ బ్రిడ్జికి మళ్లించి పనులు చేపడుతుండడం దుర్మార్గమని విమర్శించారు. అందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా ₹28కోట్లు ఉన్నాయని, దీనిపై బండికి కనీస అవగాహన లేకుండా, ఏం తెలుసుకోకుండానే ప్రజలను తప్పుదారి పట్టించేలా మాట్లాడడం అవివేకమన్నారు. తీగలగుట్టపల్లి వద్ద ఆర్వోబీ కావాలని అప్పటి ఎంపీ వినోద్‌కుమార్ 2014 నుంచి 2019 వరకు అనేక సార్లు రైల్వే అధికారులకు విన్నవించారని గుర్తుచేశారు. అయితే ఈ రూట్‌లో పాపులేషన్ లేదని బ్రిడ్జి మంజూరు చేయలేమని అప్పటి దక్షిణ మధ్య రైల్వే జోనల్ మేనేజర్ శ్రీనివాస్ పేర్కొన్నారని గుర్తు చేశారు. అయితే కార్పొరేషన్‌లో ఉంటే రైల్వే ఓవర్ బ్రిడ్జి మంజూరవుతుందన్న ఒక్క కారణంతోనే తీగలగుట్టపల్లిని నగరంలో విలీనం చేసుకొని బ్రిడ్జిని సాధించుకున్నామని చెప్పారు. కేంద్రం నేరుగా రైల్వే నిధుల నుంచి ఈ బ్రిడ్జిని నిర్మిస్తే ఇన్‌ఫ్రాస్టక్చర్ నిధులను ఇతర అవసరాలకు వాడుకునే అవకాశం ఉండేదన్నారు. నిధులు తేవడం చేతకాని బండి సంజయ్ ఇప్పుడు కేంద్రమే పూర్తి నిధులు ఇచ్చిందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆయన ఎంపీగా చేసిందేమీ లేదని, ఎన్నికలు వస్తున్నాయని డ్రామాలు ఆడుతున్నాడని, చేయని పనులను కూడా చేశానని అసత్య ప్రచారాలు చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో, నగరంలో ఎంత అభివృద్ధి జరిగిందో ప్రతి ఒక్కరికీ తెలుసునని, ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు గందె మాధవి, గుగ్గిళ్ల జయశ్రీ, గంట కల్యాణి, ఐలేందర్, నాయకులు పవన్, శ్రీనివాస్, అనిల్ పాల్గొన్నారు.

# నడుచుకుంటూ వెళ్లి..
# దారి మధ్యలో కుప్పకూలి

- గుండెపోటుతో యువకుడి హఠాన్మరణం
- నొప్పి వచ్చిందని ఆర్‌ఎంపీ వద్దకు
- మధ్యలో ఫ్రెండ్స్‌తో ముచ్చటిస్తూనే మృతి
- కోనరావుపేట మండలం నిజామాబాద్‌లో విషాదం



ముష్కం రాజు (ఫైల్)

కోనరావుపేట, జనవరి 12: గుండె నొప్పిగా ఉందని ఆర్‌ఎంపీ వద్దకు వెళ్తూ ఓ యువకుడు అనుకోని రీతిలో ప్రాణాలు కోల్పోయాడు. దారి మధ్యలో కలిసిన ఫ్రెండ్స్‌తో సరదాగా ముచ్చటిస్తూనే గుండెపోటుతో కుప్పకూలిపోయాడు. అక్కడికక్కడే చనిపోగా, గ్రామంలో విషాదం నెలకొన్నది. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామానికి చెందిన ముష్కం రాజు (33) ఉపాధి కోసం మహారాష్ట్ర వెళ్తుంటాడు. భార్య లహరి, కూతుళ్లు శ్రీనిత్య (5), ఇన్సిక (2)ను గ్రామంలో ఉంచాడు. అక్కడ కూలి పనులు చేస్తూ.. రెండు మూడు నెలలకోసారి వస్తున్నాడు. సంక్రాంతి పండుగను కుటుంబసభ్యులతో ఆనందంగా గడపడానికి వారం క్రితం ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఇంట్లో పిల్లలతో సంతోషంగా గడిపాడు. మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో ఛాతిలో నొప్పి రావడంతో తల్లడిల్లిపోయాడు. మంచినీళ్లు తాగి రిలాక్స్ అయ్యాడు. తర్వాత బస్టాండ్ సమీపంలో ఉన్న ఆర్‌ఎంపీకి చూపెట్టుకుంటానని బామ్మర్దితో కలిసి నడుచుకుంటూ వెళ్లాడు. దారి మధ్యలో బస్టాండ్ వద్ద ఉన్న తన స్నేహితులకు తనకు గుండెపోటు విషయం చెప్పి, ముచ్చటిస్తున్నాడు. అంతలోనే నొప్పి తీవ్రం కావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అక్కడకు ఆర్‌ఎంపీ చేరుకొని పరీక్షించి, సిరిసిల్ల దవాఖానకు తీసుకెళ్లాలని చెప్పాడు. ఆ వెంటే ప్రైవేట్ వాహనంలో అక్కడకు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే గుండెపోటుతో మృతిచెందాడని చెప్పారు. దీంతో కుటుంసభ్యులు ఒక్కసారిగా బోరుమన్నారు. ఇంట్లో నుంచి నడుచుకుంటూ వెళ్లి విగతజీవిగా వచ్చావా అంటూ గుండెలవిసేలా విలపించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, వైస్ ఎంపీపీ వంగపల్లి సుమలత కోరారు.

# గ్రూప్స్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 12 : కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 1, 2, 3, 4 శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కరీంనగర్ జిల్లా బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవి కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోని నిరుద్యోగులు ఈ నెల 20వరకు ఆన్‌లైన్‌లో bcstudycircle.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిగ్రీ ఉత్తీర్ణులు కులం, ఆదాయం, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు ఫొటోతో అప్లయి చేసుకోవాలని, తల్లిదండ్రుల సంవత్సర ఆదాయం ₹5లక్షలలోపు ఉండాలని చెప్పారు. వివరాల కోసం కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో గాని, 0878 2268686 నంబర్‌లో గాని సంప్రదించాలని సూచించారు.

# జపాన్, జర్మనీలో ఉద్యోగాలు

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, జనవరి 12 : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జపాన్, జర్మనీలో నర్సింగ్ ఉద్యోగావకాశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కరీంనగర్ జిల్లా ఉపాధి కల్పనాధికారి దేవేందర్ రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22 నుంచి 30 ఏండ్ల వయసు ఉండి, బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం, ఏఎన్ఎం డిప్లొమా పూర్తి చేసిన అభ్యర్థులు అప్లయ్ చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి జపనీస్, జర్మన్ భాషలపై రెసిడెన్షియల్ శిక్షణ, అక్కడ పని చేయడానికి అవసరమైన అదనపు వృత్తి పరమైన నైపుణ్యాలు అందిస్తామని చెప్పారు. అభ్యర్థులు తమ దరఖాస్తును tomcom.germany@gmail.comకు మెయిల్ చేయాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 8919047600, 95739 45684, 63022 92450 నంబర్లలో సంప్రదించాలని ఆయన సూచించారు.




ఆటో కార్మికుల సమస్యలను అధికారులకు వివరిస్తున్న కోఆప్షన్ మెంబర్ బత్తుల కమలాకర్

# కరెంట్ బిల్లు కట్టాలా.. వద్దా..?

- కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల దాటింది. ఇంకెప్పుడు స్పష్టత ఇస్తరు
- మహిళలకు ఫ్రీ బస్సు సంతోషమే
- ఆటో కార్మికుల పరిస్థితి ఏంటి?
- చందుర్తి సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

చందుర్తి, జనవరి 12: 'గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు కరెంట్ ఫ్రీగా ఇస్తామన్నరు. మ్యానిఫెస్టోలో పెట్టినన్రు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెల దాటింది. మరి కరెంట్ బిల్లులు కట్టుడా..? లేదా..? ఏదో ఒకటి స్పష్టత ఇవ్వాలి. మహిళలకు బస్సు ఫ్రీ చేయడం సంతోషమే కానీ, ఆటోకార్మికుల పరిస్థితి ఏంటో చెప్పాలి' అని అధికారులను చందుర్తి ప్రజాప్రతినిధులు నిలదీశారు. గ్రామాల్లోని సమస్యలు, ప్రభుత్వ పథకాలపై స్పష్టత ఇవ్వాలంటూ కన్నెర్ర జేశారు. చందుర్తి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బైరగోని లావణ్య అధ్యక్షతన శుక్రవారం వాడీవేడీగా జరిగింది. గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాలపై రగడ నెలకొన్నది. మహాలక్ష్మి పథకం పేరిట మహిళలకు బస్సు ఫ్రీ చేయడం మంచిదే కానీ, మండలంలో 500 మంది ఆటో కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని కో ఆప్షన్ సభ్యుడు బత్తుల కమలాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే వారికి చేయూతనివ్వాలని కోరారు. విద్యుత్ లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించాలని జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేశ్ కోరారు. అంతర్గత రోడ్లకు ఇరువైపులా మట్టి లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, సైడ్ షోల్డర్ పనులు వెంటనే చేపట్టాలని ఎంపీటీసీ గడ్డం రణధీర్ రెడ్డి, సర్పంచ్ చిలుక అంజి బాబు వాగ్వాదానికి దిగారు. మోత్కరావుపేట, చందుర్తి రోడ్ల నిర్మాణాలపై స్పష్టత ఇవ్వాలని సెస్ డైరెక్టర్ పొన్నాల శ్రీనివాసరావు డిమాండ్ చేయగా, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. అనంతరం జడ్పీ చైర్ పర్సన్ నాల్యకొండ అరుణ మాట్లాడుతూ, గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలకమని, సమన్వయంతో ముందుకుసాగుతూ ఇన్నాళ్లూ ఎంతో ప్రగతిసాధించారని, ఇప్పుడూ అలాగే నడుచుకోవాలని సూచించారు. ఇక్కడ జడ్పీటీసీ నాగం కుమార్, సర్పంచుల ఫోరం కన్వీనర్ కమలాకర్ రావు, ఎంపీటీసీల ఫోరం కన్వీనర్ వేణు, ఎంపీడీవో రవీందర్, తాసిల్దార్ సీహెచ్ శ్రీనివాస్, ఎంపీఓ ప్రదీప్ ఉన్నారు.

# రూ.200 కోసం గొంతు కోసిండు

కోరుట్ల, జనవరి 12: రూ.200 ఇవ్వని పాపానికి ఓ వ్యక్తి గొంతుకోసిన ఘటన జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణం గంగంపేట కాలనీలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని గంగంపేట కాలనీకి చెందిన గౌస్, షారూఖ్ ఇద్దరు ఇరుగుపొరుగు ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. కూలీ పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే శుక్రవారం షారూఖ్ మద్యం తాగేందుకు రూ.200 కావాలని గౌస్‌ను అడిగాడు. డబ్బులు లేవని చెప్పడంతో షారూఖ్ ఆగ్రహించాడు. గౌస్‌తో గొడవ పడ్డాడు. తన వద్ద ఉన్న బ్లేడ్‌తో గొంతు కోశాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని స్థానిక ఏరియా దవాఖానకు చికిత్స అందించారు.



వెల్గటూర్, ఎండపల్లి బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

# అధైర్య పడద్దు.. అండగా ఉంటాం

- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి
- కార్యకర్తలకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భరోసా

వెల్గటూర్, జనవరి 12: 'అధికారం లేదని కార్యకర్తలు అధైర్య పడద్దు. పార్టీ అన్ని విధాల అండగా ఉంటుంది' అంటూ బీఆర్ఎస్ శ్రేణులకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ భరోసానిచ్చారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ ఆశీస్సులతో 20 ఏండ్ల నుంచి ఎమ్మెల్యేగా, విప్‌గా, మంత్రి హోదాల్లో ప్రజల కోసం పనిచేశానని చెప్పుకొచ్చారు. ఇప్పుడు చిన్న బ్రేక్ వచ్చిందని పేర్కొన్నారు. వెల్గటూర్ మండలంలోని కిషన్‌రావుపేటలో శుక్రవారం వెల్గటూర్, ఎండపల్లి మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కొప్పుల హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని చెప్పారు. కొత్త ప్రభుత్వం ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారని, కానీ సర్కారు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా బీఆర్ఎస్‌పై కక్ష సాధిస్తున్నదని మండిపడ్డారు. 'మంచి ప్రభుత్వాన్ని పోగొట్టుకున్నాం' అని ప్రజల్లో ఇప్పటికే ఆలోచన మొదలైందన్నారు. కార్యకర్తలను వేధిస్తే ఊరుకోబోమని, అందుకు లీగల్ సెల్ ఏర్పాటు చేశామని చెప్పారు. దళిత బంధు అమలు కోసం పోరాటం చేయాలని నాయకులకు సూచించారు. పార్లమెంట్ ఎన్నికలకు సమాయత్తం కావాలని, మళ్లీ గులాబీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. ఇక్కడ ఎంపీపీ కునమల్ల లక్ష్మి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చల్లూరి రాంచందర్‌గౌడ్, సింహాచలం జగన్, జుపాక కుమార్, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు పోడేటి సతీశ్, ఎంపీటీసీలు గాజుల మల్లేశం, మూగల రాజేశ్వరి-సత్యం, సర్పంచులు మేర్గు కొమురయ్య, ముల్కల్ల గంగారాం, గంగుల నగేశ్, బోడకుంటి రమేశ్, మారం జలేందర్‌రెడ్డి, ప్యాక్స్ చైర్మన్లు గూడ రాంరెడ్డి, గోలి రత్నాకర్ పాల్గొన్నారు.

# పోలీసులకు చిక్కిన కీచకుడు

- ఫేక్ అకౌంట్‌తో ఫేస్‌బుక్‌లో చిన్న పిల్లల అసభ్యకర వీడియోలు అప్‌లోడ్
- గుర్తించి కేసు నమోదు
- తాజాగా రిమాండ్
- వివరాలు వెల్లడించిన చందుర్తి సీఐ కిరణ్‌కుమార్

కోనరావుపేట, జనవరి 12: ఇంటర్నెట్ చిన్నపిల్లల అసభ్యకర వీడియోలు చూస్తూ ఫేక్ అకౌంట్‌తో ఫేస్‌బుక్‌లో అప్‌లోడ్ చేస్తున్న కీచకుడు పోలీసులకు చిక్కాడు. కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు విలేకరుల సమావేశంలో చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ వివరాలు వెల్లడించారు. కోనరావుపేట మండలం రామన్నపేటకు చెందిన మహమ్మద్ రజాక్ హైదరాబాద్‌లో ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. జల్సాలకు అలవాటు పడ్డాడు. అలాగే తన స్మార్ట్‌ఫోన్‌లో వీపీఎన్ ద్వారా చైల్డ్ పోర్నోగ్రఫీ అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని చిన్నపిల్లల అసభ్యకరమైన వీడియోలను చూస్తుండేవాడు. అంతటితో ఆగకుండా సాలికవర్మ పేరిట ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్‌ను క్రియేట్ చేసి, చిన్నపిల్లల అసభ్యకరమైన వీడియోలను అప్‌లోడ్ చేస్తున్నాడు. ఉన్నతాధికారుల సమాచారం రాగా, పోలీసులు నిఘా పెట్టారు. ఫేక్ అకౌంట్ పేరిట అప్‌లోడ్ చేస్తున్నది రజాకేనని గుర్తించారు. ఈ నెల 9న కేసు నమోదు చేశారు. శుక్రవారం కొలనూర్ నుంచి సిరిసిల్ల వెళ్తుండగా పట్టుకుని అరెస్ట్ చేశారు. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండ్ తరలించారు. అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఇక్కడ ఏఎస్ఐ రఘుపతిరెడ్డి, సిబ్బంది ఉన్నారు.